క్లుప్తంగా

నేడు లాస్ట్ బస్టాప్‌లో చలివేంద్రం ఏర్పాటు

జగద్గిరిగుట్ట: ప్రజలకు వేసవి దప్పిక తీర్చడానికి ప్రతీ సంవత్సరం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేస్తారు. గురువారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ సభ్యులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఒక రోజుకి రూ.1500 చెల్లిస్తే ఆ రోజు మొత్తం వారి పేరుతో మజ్జిగ సరఫరా చేస్తామని సభ్యులు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములవుతాం

నిజాంపేట్: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో 19వ డివిజన్‌లో బుధవారం స్వచ్ఛ మాషాల్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శెనగల ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, విజయలక్ష్మి, గాజుల సుజాత, బాలాజీ నాయక్ పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములవుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అధ్యక్షుడు కొలన్ సత్తిరెడ్డి, స్థానిక మహిళలు, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి



జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ స్టేట్ జాయింట్ కో–ఆర్డినేటర్‌గా గడ్డమీది భరత్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

నిజాంపేట్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై ఏహెచ్‌టీయూ సిబ్బంది దాడులు నిర్వహించి నిర్వాహకురాలితో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలోని బ్లాక్ నం.100లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో బుధవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో సైబరాబాద్ ఏహెచ్‌టీయూ టీమ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిర్వాహకురాలు లక్ష్మి(45), విటుడు రమేష్ (26)లతో పాటు రుక్సానా బేగం పట్టుబడ్డారు. నిర్వాహకుల నుంచి రెండు స్మార్ట్‌ఫోన్‌లు, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బాచుపల్లి పోలీసులకు అప్పగించారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న కంపెనీలపై కేసు

కుత్బుల్లాపూర్: నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న పరిశ్రమ కోల్డ్ స్టోరేజీ గోదాంపై పేట్‌బషీరాబాద్ పోలీసులు దాడులు నిర్వహించి ల్యాప్‌టాప్, డాక్యుమెంట్లను సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లిలోని నూజివీడు సీడ్స్ కంపెనీ ఎన్ఎంహెచ్ 8352 విన్నర్ బ్రాండ్ పేరుతో మొక్క జొన్న విత్తనాలను విక్రయిస్తోంది. అయితే అదే ఫార్ములాను కాపీ కొట్టి యాగంటి అగ్రిటెక్ పరిశ్రమ సర్పంచ్- 3969 పేరుతో మొక్కజొన్న విత్తనాలను మార్కెట్‌లో విక్రయిస్తోంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం యాగంటి అగ్రిటెక్‌కు చెందిన కోల్డ్ స్టోరేజీ గోదాంపై దాడులు నిర్వహించి సర్పంచ్–3969 విత్తనాలతో పాటు ల్యాప్‌టాప్, రిజిస్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బయటకు వెళ్తే మాస్క్ ధరించండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో బుధవారం కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు చేశారు. సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 19 మంది పరీక్షలు చేయించుకోగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయి. కోవిడ్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బయటకు వెళ్తే మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు.

అసంపూర్తి పార్కులే అధికం.!



పార్కుల్లో నిలిచిన వరదనీరు



నిజాంపేట్: అధికారుల ప్రణాళిక లోపం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం.. వెరసి పార్కుల అభివృద్ధి పనులు పూర్తి కావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లోని 33 వార్డుల్లోని 114 పార్కులకు గాను 90 శాతం పార్కుల్లో అభివృద్ధి పనులు పూర్తి కాలేదు. కొన్నింటిలో ఇంకా ఎలాంటి పనులు ప్రారంభించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఈ విషయాన్ని అధికారులు, కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లోనే ఏకంగా 52 పార్కులు ఉన్నాయి. గతంలో ఈ ప్రాంతం గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే పార్కుల అభివృద్ధి జరిగింది. ఆ పార్కులు తప్ప మున్సిపల్‌గా మారిన తరువాత పూర్తి అభివృద్ధి జరిగిన పార్కులు లేవనే చెప్పాలి. ప్రారంభించిన పనులు పూర్తికాక అసంపూర్తిగా మిగిలి ఉన్న పార్కులే ఇక్కడ ఎక్కువ కనిపిస్తాయి.

ప్రణాళిక లోపం...

పార్కుల్లో అభివృద్ధి పనుల్లో స్పష్టంగా ప్రణాళిక లోపం కనిపిస్తోందనే చెప్పాలి. ప్రణాళికబద్ధంగా వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, పంచతత్వ పార్కులను అభివృద్ధి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కుల్లో వరద నీరు చేరుతోందన్నారు. నాలుగైదు రోజుల వరకు అలాగే నిలిచిపోవడంతో పార్కులకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నిర్వహణ గాలికి...

ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆడుకునే మెషిన్లు, పరికరాల నిర్వహణను గాలికొదిలేశారు. పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు పాడైపోయాయని చెబుతున్నారు. పిల్లలు ఆడుకునే మెషిన్లు, జిమ్ పరికరాల మరమ్మతులు చేయాలనే ధ్యాస కూడా అధికారులు మరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి పరిస్థితిని కూడా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మూత్రశాలలు లేవు...

పార్కుల్లో మూత్రశాలలు నిర్మించాలన్న ఆలోచన అటు అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు రాకపోవడం గమనార్హం. మహిళలు, వృద్ధులు కాలనీ సమీపంలోని పార్కుల్లోకి వాకింగ్‌కు వస్తుంటారు. పిల్లల ఆడుకోవడానికి వస్తుంటారు. మూత్రశాలలు లేక ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పార్కులో మూత్రశాలలు నిర్మించే విధంగా మేయర్ కొలను నీలారెడ్డి చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం..



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అన్ని పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరుస్తాం. అందు కోసం అవసరమైన నిధులను కేటాయిస్తాం. అసంపూర్తిగా ఉన్న పార్కులను సందర్శించి పూర్తి ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తాం. అదే విధంగా ప్రతి పార్కులో మూత్రశాలలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాను. పార్కుల విషయంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ నిరంతరం ఉండే విధంగా చర్యలు తీసుకుంటాను.

– మేయర్ కొలను నీలారెడ్డి

‘తొమ్మిదేళ్లుగా డబుల్ ఇళ్లు ఇస్తామని ఊరిస్తున్నారు’

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటి వరకు నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆరోపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీశైలంగౌడ్ డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామంటూ ప్రభుత్వం ఊరిస్తోందని విమర్శించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పది లక్షల జనాభా ఉంటే ఎన్ని డబుల్ రూమ్ ఇళ్లను నిర్మించారో చెప్పాలన్నారు. అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లను ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి వారంరోజుల్లో అర్హులకు డబుల్ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల ఎదుట దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

‘సామాజిక సేవలో ఎస్వీఆర్ ట్రస్ట్ ముందుంటుంది’



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: సామాజిక సేవలో ఎస్వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందని సంస్థ చైర్మన్ శౌంతిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. బుధవారం సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లో ఎస్వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కంటి, సాధారణ పరీక్షలు నిర్వహించగా 200 మంది హాజరయ్యారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మెంబర్ దండే రాజు, హియరింగ్ సొల్యూషన్ డాక్టర్ క్యాథలిక్, నెహ్రూనగర్ ప్రెసిడెంట్ ప్రశాంత్, సాధన స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, ప్రిన్సిపల్ నగేష్ రాజు పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి



పీఎస్ కమిటీ మీటింగ్‌లో సూచనలు చేస్తున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు

కుత్బుల్లాపూర్: శ్రీరామనవమి పండగ నేపథ్యంలో బుధవారం పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు అధ్యక్షతన పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హిందూ, ముస్లిం పెద్దలు హాజరయ్యారు. శాంతియుతంగా శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసే బాధ్యత పీస్ కమిటీ సభ్యులదేనని పోలీసులు స్పష్టం చేశారు.

శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఆహ్వానం



మేయర్ నీలారెడ్డిని ఆహ్వానిస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: శ్రీరామనవమి వేడుకలకు హాజరు కావాలని 18వ వార్డు కార్పొరేటర్ కొలను వీరేందర్‌రెడ్డి బుధవారం మేయర్ కొలను నీలారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. బాచుపల్లిలోని శ్రీహోమ్స్ కాలనీ, నందనవనం కాలనీ, కేఆర్‌సీఆర్ కాలనీలల్లో నిర్వహించే ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలన్నారు. అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీల ప్రజలు, కార్పొరేటర్లు మేయర్‌ను ఆహ్వానించారు.

ఠాణా నిర్మాణానికి అహర్నిశలు కృషి చేశా

బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింహారెడ్డి



నిజాంపేట్: ప్రభుత్వ ఉద్యోగులు నూటికి తొంబై మంది సమయ పాలన పాటించి తమ తమ ఉద్యోగం చేసుకుని రిలాక్స్ అవుతారు. కాని కొందరు మాత్రమే ఉద్యోగాన్ని సైతం ఒక ఉద్యమంలా చేస్తారు. అలాంటి ఓ పోలీస్ ఉద్యోగి బాచుపల్లి ఇన్స్‌పెక్టర్ నర్సింహారెడ్డి. తెలంగాణ రాష్ట్రంలోనే బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఈనెల 24న రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే ఈ పోలీస్‌స్టేషన్‌ను సుమారు 2 ఎకరాల సువిశాలమైన స్థలంలో అధునాతన హంగులతో నిర్మించి పోలీస్ శాఖ చరిత్ర సృష్టించిందని చెప్పవచ్చు. అరబిందో ఫార్మ ఫౌండేషన్ సుమారు 3.5 కోట్ల వరకు నిధులు సమకూర్చగా స్థానిక దాతల సహకారంతో స్థానిక ఇన్స్‌పెక్టర్ నర్సింహారెడ్డి మరో రెండు కోట్ల నిధుల వరకు సమకూర్చి పోలీస్‌స్టేషన్‌కు తుదిమెరుగులు దిద్దారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యే వరకు నర్సింహారెడ్డి అహర్నిషలు కృషి చేశారు. ఓ వైపు శాంతి భద్రతల పరిరక్షణలో తన పాత్ర పోషిస్తూనే పోలీస్‌స్టేషన్ నిర్మాణంపై తన దృష్టి సారించారు. ప్రభుత్వ కార్యాలయాలు కాంట్రాక్టర్‌లకు అప్పగించి కేవలం ప్రారంభ సమయంలోనే అధికారులు అక్కడకు వస్తారు. కాని ఇక్కడ అలా కాదు తన సొంత ఇంటి నిర్మాణంపై మనం చూపే మక్కువ కంటే ఎక్కువ దృష్టి నిర్మాణంపై చూపడం విశేషం. పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు ఇన్స్‌పెక్టర్ నర్సింహారెడ్డిని అభినందిస్తున్నారు. అందరిచే శభాష్ అనిపించుకుంటున్న నర్సింహారెడ్డి బాచుపల్లి ప్రాంతంలో తనదైన ముద్ర వేసుకున్నారనడంలో అతిశయోక్తి లేదు.

- పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పర్యాటక వాతావరణం కల్పించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేయడం పట్ల అందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2020 అక్టోబర్‌లో బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన నర్సింహారెడ్డి పోలీస్‌స్టేషన్ నిర్మాణ దశ నుంచి కేవలం సంవత్సన్నర కాలంలోనే పోలీస్‌స్టేషన్ ప్రజలకు అందుబాటులోకి తెచ్చే ఏ విధంగా కృషి చేశారు. ప్రజలకు రక్షణ నిలయంగా ఉన్న పోలీస్‌స్టేషన్ నిర్మాణంలో ప్రజలను సైతం భాగస్వామ్యం చేయడం నర్సింహారెడ్డి సమయస్ఫూర్తే అని చెప్పవచ్చు.

వృథాగా.. రెండు రోజులుగా



పాపయ్యయాదవ్ నగర్‌లో లీకవుతున్న గోదావరి జలాలు

జగద్గిరిగుట్ట: చింతల్ పాపయ్య యాదవ్‌నగర్ ప్రధాన రహదారిలో రెండు రోజులుగా గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. నీటి వినియోగంపై జలమండలి అధికారులు ఈనెల 22 నుంచి 31 వరకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం ప్రగతియాత్రలో భాగంగా జీడిమెట్ల డివిజన్ పరిధి ఎంఎన్‌రెడ్డి నగర్ ఫేజ్–1, 2, ఎంఎన్‌రెడ్డినగర్ వెస్ట్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు పూర్తి చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ, కుక్కల బెడద, రెవెన్యూ సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కాలనీ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ లెటర్‌ప్యాడ్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, సంపత్ గౌడ్, నాగేశ్వర రావు, వార్డు సభ్యులు సుధాకర్‌గౌడ్, ఇందిరారెడ్డి, సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్‌రెడ్డి, నదీం రాయ్, నాగేష్‌రెడ్డి, విజయ్, హరీష్ పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య సంజీవనిలా అరుంధతి ఆస్పత్రి



మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్‌లను సత్కరించిన జర్నలిస్టులు

దుండిగల్: దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో అత్యాధునికమైన వైద్య పరికరాలతో ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. బుధవారం అరుంధతి ఆస్పత్రిలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అరుంధతి ఆస్పత్రి చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వివరించారు. రోగులకు రక్తపరీక్షలతో పాటు సీటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సేవలను అందించడం గొప్ప విషయమని అన్నారు. పేదలకు ఆరోగ్య సంజీవనిలా అరుంధతి ఆస్పత్రి నిలుస్తోందన్నారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి విరహత్ అలీ, ఐజేయూ కార్యవర్గ సభ్యుడు కె.సత్యనారాయణ, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం



ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

నిజాంపేట్: బాచుపల్లి మండలంలోని సర్వే నం.186 ప్రభుత్వ స్థలానికి సంబంధించిన సరిహద్దు రాళ్లను కొందరు తొలగించి కబ్జాకు యత్నిస్తున్నారు. ఏకంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన కడీలనే తొలగించడం స్థానికంగా చర్చనీయంశమైంది. ఈ చర్యలకు పాల్పడిన వారు ఎవరు అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. నిజాంపేట్‌లోని జర్నలిస్టుకాలనీ సమీపంలో ఉన్న స్ప్రింగ్ విల్లే గేటెడ్ కమ్యూనిటీని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం హద్దులను తొలగించారు. ఇక్కడ కడీలను తొలగించి దర్జాగా ఓ ట్రాక్టర్‌లో తరలించారని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి హద్దు రాళ్లను తొలగించినపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే ప్రభుత్వ స్థలం చూట్టు తిరిగి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్థలాన్ని సంరక్షించాలని కోరుతున్నారు.

కాలనీ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

రంగారెడ్డినగర్: కాలనీవాసుల సహాయ సహకారాలతో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అభివృద్ధి చేస్తున్నామని ఆదర్శనగర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రంగారెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య అన్నారు. బుధవారం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంవత్సర కాలంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాలనీ సొసైటీకి సంబంధించి రూ.78 లక్షలు నగదు బ్యాంక్‌లో జమ అయ్యిందన్నారు. కాలనీలో చేపట్టాల్సిన భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, సీసీ కెమెరాలు, జిమ్, మంచినీటి పైప్ లైన్, ఆడిటోరియంతో పాటు ఇతరత్రా పెండింగ్ పనులు దశలవారీగా ఎమ్మెల్యే వివేకానంద్, శాసనమండలి విప్ శంభీపూర్ రాజు, కార్పొరేటర్ విజయ శేఖర్‌గౌడ్‌ల సహకారాలతో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు ఏం. దుర్గ, కార్యదర్శి వి. ఆంజనేయులు, కోశాధికారి కే .నాగభూషణం, డైరెక్టర్లు నాగదేశి రవికుమార్, పీవీఎల్ నాంచారమ్మ, ఎస్. చంద్రోశేఖర్, సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కోటేశ్వరరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు





విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, హాజరైన టెన్త్ విద్యార్థులు

మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి

దుండిగల్: తల్లిదండ్రుల ఆశయ సాధనకు విద్యార్థులు కష్టపడి చదవాలని మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం బౌరంపేట్‌లోని జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదివితే సులభంగా మంచి మార్కులను సాధించవచ్చన్నారు. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం రాంరెడ్డి, నాయకులు పీసరి కృష్ణారెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం యేసయ్య, ఉపాధ్యాయులు రమేష్, మదన్ రెడ్డి, ప్రదీప్ రావు, రాజేష్, పద్మప్రియ, గీత, విజయలక్ష్మి, సదాలక్ష్మి పాల్గొన్నారు.

వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతిలో 150 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. చివరి రోజు రక్తదాన శిబిరాన్ని జేఎన్‌టీయూహెచ్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ, ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయ కర్త డాక్టర్ సైదా నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సైదానాయక్ అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త పద్మావతి ఆధ్వర్యంలో మొదటి రోజు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, రెండో రోజు తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ, మూడవ రోజు బీబీఆర్ బ్లడ్ బ్యాంక్‌ల సహకారంతో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది రక్తదానం చేసినట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సి.డి.నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బలగం వీక్షణ.. నటులకు అభినందన



బలగం చిత్రంలో నటించిన సుధాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, కుటుంబ బంధాలు తెలియజేస్తూ తీసిన బలగం చిత్రాన్ని బుధవారం కొంపల్లిలోని సినీ ప్లానెట్‌లో శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు గుడాల భాస్కర్, బలగం సినిమా కొమురయ్య పాత్రధారి సుధాకర్ రెడ్డిలతో కలిసి వీక్షించారు. అనంతరం సుధాకర్ రెడ్డి నటనను అభినందిస్తూ శాలువతో సత్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, దుండిగల్ వైస్ చైర్మన్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, నిజాంపేట్ కార్పొరేటర్లు, కొంపల్లి చైర్మన్, కౌన్సిలర్లు, దుండిగల్ కౌన్సిలర్లు, పార్టీ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కురుమారియమ్మన్ బోనాలు

చింతల్: చింతల్ డివిజన్ తమిళ బస్తీలో శ్రీ కురుమారియమ్మన్ బోనాల మహోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవిజె జేమ్స్, పండరి రావు, డోరా అరుణ్, హనుమంతు, అజయ్, రహీం, కలీం, రాహుల్, గురు పాల్గొన్నారు.

